పత్తి క్వింటాల్ ధర రూ.7,250

జమ్మికుంట, జూన్ 14: పత్తి ధరలు పెరుగుతూ పోతున్నాయి. జమ్మికుంట కాటన్ మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటాల్ పత్తికి గరిష్ఠ ధర రూ.7,250 పలికింది. మార్కెట్‌కు విడి పత్తి 130 క్వింటాల్స్ రాగా, గరిష్ఠ ధర రూ.7,250, మెడల్ ధర రూ.7,150, కనిష్ఠ ధర రూ.6,800గా నమోదైంది. సంచుల్లో వచ్చిన పత్తిని క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.6,500తో వ్యాపారులు కొనుగోలు చేశారు. కొనుగోళ్లను ఉన్నత శ్రేణి కార్యదర్శి జీ రెడ్డి నాయక్, గ్రేడ్-2 కార్యదర్శి రాజ, సూపర్‌వైజర్లు లక్ష్మణ్, బాబా పర్యవేక్షించారు. ఇక్కడ వ్యాపారులు, అడ్తిదారులు, గుమస్తాలు, కార్మికులు, రైతులున్నారు.

మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా నాలుగు రోజులు సెలవులున్నాయని, రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకురావద్దని ఉన్నత శ్రేణి కార్యదర్శి జీ రెడ్డినాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారం సాధారణ సెలవులని, సోమవారం బక్రీద్ పండుగ ఉందని, మంగళవారం బిజిగిరిషరీఫ్ దర్గా ఉర్సు ఉత్సవాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సెలవు రోజుల్లో మార్కెట్‌కు వచ్చి రైతులు ఇబ్బందులు పడొద్దని సూచించారు. మార్కెట్ బుధవారం పునఃప్రారంభమవుతుందని, రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఊట్కూరి రాధాకృష్ణారెడ్డికి ఉత్తమ రక్తదాత అవార్డు

విద్యానగర్, జూన్ 14 : జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రటరీ ఊట్కూరి రాధాకృష్ణా రెడ్డి ఉత్తమ రక్తదాత అవార్డు అందుకున్నారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఉత్తమ రక్తదాత అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. స్వచ్ఛందంగా 66 సార్లు రక్తదానం చేసినందుకుగానూ ఈ అవార్డు లభించినట్లు ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒక రక్తదాతను తయారు చేయడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా శాఖ చైర్మన్ పెండ్యాల కేశవరెడ్డి, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

'బిల్డ్ ఎక్స్‌పో' విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, జూన్ 14: నగరంలోని వైశ్య భవనంలో సెప్టెంబర్ 13,14,15 తేదీల్లో నిర్వహించనున్న బిల్డ్ ఎక్స్‌పో-2024ను విజయవంతం చేయాలని అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజినీర్స్ చైర్మన్ ఈగల రాజేందర్ కోరారు. నగరంలోని ప్రెస్‌భవనంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజినీర్స్ అండ్ ఆర్కిటెక్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తగా నిర్వహిస్తున్న బిల్డ్ ఎక్స్‌పోలో నిర్మాణ రంగంలో వస్తున్న మార్పులు, నూతన కట్టడాల విధానాలను నగర వాసులకు తెలియజేయడం కోసం రాష్ట్రంలోని పలు ప్రముఖ నిర్మాణ సంస్థల స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ బిల్డ్ ఎక్స్‌పోకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు అనంతరం ఎక్స్‌పో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కోల అన్నారెడ్డి, సబ్బని శ్రీనివాస్, రంజిత్‌కుమార్, బషీర్, రాజగోపాల్, ప్రశాంత్, సంతోష్, అభినమ్ పాల్గొన్నారు.

టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గంలో జిల్లావాసులకు పెద్దపీట

కొత్తపల్లి, జూన్ 14: టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గంలో కరీంనగర్ జిల్లా వాసులకు పెద్దపీట వేశారు. టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో కేంద్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. దీనిలో నూతనంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఎస్ఎం ముజీబ్ హుస్సేన్ ఏకగ్రీవంగా ఎన్నికవగా, జిల్లాకు చెందిన గూడ ప్రభాకర్‌రెడ్డి, రాగి శ్రీనివాస్‌ను రాష్ట్ర కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. నూతనంగా రాష్ట్ర కార్యవర్గానికి ఎన్నికైన జిల్లాకు చెందిన నాయకులను కరీంనగర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దారం శ్రీనివాస్‌రెడ్డి, సంగెం లక్ష్మణరావు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాగుల నరసింహస్వామి, పెద్దపల్లి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొంకూరి శంకర్, సందీప్, సిరిసిల్ల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్, సుదర్శన్, జగిత్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శశిధర్, నాగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా కవులకు 'పెందోట' సాహిత్య పురస్కారాలు

కమాన్‌చౌరస్తా, జూన్ 14: కరీంనగర్‌కు చెందిన ఇద్దరు కవులు పెందోట సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. కవి, రచయిత, విమర్శకుడు, భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన 'బాలగేయ సారస్వతం' పుస్తకాన్ని పెందోట బాల సాహిత్య పురస్కారానికి, కవి, తెలంగాణ రచయితల వేదిక ఉపాధ్యక్షుడు పెనుగొండ బసవేశ్వర్ రచించిన 'ప్రశ్నను మింగిన కాలం'ను పెందోట సాహిత్య పురస్కారానికి ఎంపిక చేసినట్లు సిద్దిపేటకు చెందిన శ్రీవాణి సాహిత్య పరిషత్ సంస్థ వ్యవస్థాపకుడు పెందోట వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో సిద్దిపేటలో జరుగనున్న కార్యక్రమంలో కవులకు పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

కలెక్టరేట్, జూన్ 14 : జిల్లాకేంద్రంలోని అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాల కోసం అంధ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ బి.నర్మద తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఉచితంగా విద్య, భోజన వసతి కల్పించనున్నట్లు వెల్లడించారు. 6 నుంచి 14 ఏళ్ల వయసు కలిగి ఉండి, 40 శాతానికి పైగా అంధత్వం ఉన్న బాల, బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఔత్సాహికులైన విద్యార్థులతో దరఖాస్తులు పూరించి, శాతవాహన వర్సిటీకి ఎదురుగా గల ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో అందజేయాలని తల్లిదండ్రులను కోరారు. పూర్తి వివరాలకు 9494317315/ 9701190124/ 7396206959/ 9440338424 నంబర్లలో సంప్రదించాలని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో సూచించారు.

మోడల్ స్కూల్‌లో ఆంగ్ల బోధనకు..

తిమ్మాపూర్, జూన్ 14: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 6-10వ తరగతులకు ఇంగ్లిష్ సబ్జెక్టు బోధించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఎంఏ ఇంగ్లిష్, బీఈడీ ఇంగ్లిష్ మెథడాలజీ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 18 లోగా సంబంధిత డ్రువీకరణ పత్రాలు పాఠశాలలో అందజేయాలన్నారు.

పాఠ్యపుస్తకాల్లో కేసీఆర్ పేరుండడం తప్పా?

కలెక్టరేట్, జూన్ 14 : విద్యార్థులకు అందజేస్తున్న పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పేరుంటే తప్పేంటని తెలంగాణ మైనార్టీ మేధావుల ఫోరం జిల్లా కన్వీనర్ మహ్మద్ ఇంతియాజ్ ప్రశ్నించారు. శుక్రవారం నగరంలోని ఫోరం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన త్రైమాసిక సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ ఫొటో, పేరుతో ఉన్న పుస్తకాలు విద్యార్థుల నుంచి తిరిగి వెనక్కు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం అవివేకమన్నారు. పంతాలు, పట్టింపులు వీడి ప్రజా సంక్షేమం కోసం పాటుపడితే, ప్రజల మన్ననలు పొందుతారని హితవు పలికారు. సమావేశంలో ఫోరం ప్రతినిధులు అక్బర్, అయేషా ఖాన్, రహమతుల్లాతో పాటు పలువురు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను ప్రజాక్షేత్రంలో ఎదుర్కోలేకే కేసులు

హుజూరాబాద్ రూరల్, జూన్ 14: బీఆర్ఎస్‌ను ప్రజా క్షేత్రంలో ఎదుర్కోలేకే కాంగ్రెస్ నాయకులు అక్రమ కేసులు పెడుతున్నారని, తమ కార్యకర్తలకు ఏం జరిగినా కాంగ్రెస్ పార్టీ, పోలీసు శాఖ బాధ్యత వహించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోతారవేణి అనిల్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని ఎండగడతామన్నారు. ఆరు గ్యారెంటీలపై నిలదీస్తామని, కేసులతో భయపడే పార్టీ బీఆర్ఎస్ కాదని స్పష్టం చేశారు. ఫైయాస్ తరలింపు వ్యవహారంలో వచ్చిన ఆరోపణలు తప్పయితే మంత్రి పొన్నం నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

మత్స్య పారిశ్రామిక సంఘం డైరెక్టర్‌కు అభినందన

గంగాధర, జూన్ 14: జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల్లో సంఘం డైరెక్టర్‌గా ఆచంపల్లి గ్రామానికి చెందిన రేగుల రాజేందర్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను సర్వారెడ్డిపల్లి మాజీ ఉప సర్పంచ్ రేగుల రజితాతిరుపతి, నాయకులు రేడుల భార్గవ్, సంఘం సభ్యులు అభినందించారు.

హెచ్‌సీఎల్‌లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

గంగాధర, జూన్ 14: మధురానగర్ మైనారిటీ బాలికల గురుకుల కళాశాలలో 2023-24 సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థినులు సింధూజ, శైలజ హెచ్‌సీఎల్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ప్రతిభ చూపి ఉద్యోగం సాధించారు. కాగా, శుక్రవారం కళాశాల కార్యాలయంలో ప్రిన్సిపాల్ వారుణి, ఉపాధ్యాయులు విద్యార్థినులను శాలువాలతో సన్మానించి అభినందించారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి

- నాలుగేళ్లలో రూ. 499 కోట్లతో పనులు చేశాం
- శివారు ప్రాంతాలు, డివిజన్ల అభివృద్ధికి ప్రాధాన్యం
- మేయర్ సునీల్‌రావు

13వ డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు

కార్పొరేషన్, జూన్ 14: ప్రజల అవసరాలకు అనుగుణంగానే నగరపాలక సంస్థ అభివృద్ధి పనులు చేపడుతున్నదని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం 13వ డివిజన్‌లో రూ. 13 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ ముగియడంతో నగరంలో అభివృద్ధి పనుల్లో వేగం పెరిగిందన్నారు. ఇప్పటికే టెండర్లు పూర్తయిన పనులన్నింటినీ తక్షణమే ప్రారంభించేలా చర్యలు చేపట్టామన్నారు. కొత్త కొత్త కాలనీలు శరవేగంగా పెరుగుతుండగా ఆయా చోట్ల పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసి నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టి నగర రూపురేఖలు మార్చామన్నారు. నాలుగేళ్లలో రూ.499 కోట్లతో పనులు చేశామని, వీటిల్లో రూ. 152 కోట్లు సాధారణ నిధులు, రూ.347 కోట్లు సీఎం అస్యూరెన్స్ నిధులని వెల్లడించారు. శివారు ప్రాంతాలు, డివిజన్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రతి ఇంటికీ ప్రతి రోజూ మంచినీటి సరఫరా అందించాలన్న లక్ష్యంతో రూ. 133 కోట్లతో పనులు చేపట్టామన్నారు. ప్రస్తుతం డ్యాంలో నీటి మట్టం తక్కువగా ఉండడంతో రోజు తప్పించి రోజు నీటి సరఫరా చేస్తున్నామని, నీటి మట్టం పెరిగిన వెంటనే తిరిగి ప్రతి రోజూ నీటి సరఫరా చేస్తామని పేర్కొన్నారు. వానకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. వర్షకాలంలో ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొనేందుకు డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామన్నారు. వర్షాలతో ఎక్కడైనా వరద నీరు నిలిస్తే వెంటనే తొలగింపునకు చర్యలు చేపడుతామన్నారు. నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీ రిజర్వాయర్ పరిధిలో 24 గంటల పాటు మంచినీటి సరఫరా చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నగరంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను కూడా సత్వరమే పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, డీఈ ఓంప్రకాశ్, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

'సహకార' సేవలు సద్వినియోగం చేసుకోవాలి



పెట్రోల్‌పంపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

చొప్పదండి, జూన్ 14: చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సేవలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పిలుపునిచ్చారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ చొప్పదండి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇయోసీఎల్ కన్యూమర్ బంక్‌ను కేంద్ర ప్రభుత్వ సహకారంతో రిటైల్ అవుట్‌లెట్‌గా మార్చగా, పెట్రోల్ బంక్‌ను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పునర్ ప్రారంభించారు. సంఘం అభివృద్ధికి కృషిచేసిన అధ్యక్షుడు, పాలకవర్గం, సిబ్బంది, సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు వెల్మ మల్లారెడ్డి, క్రిబ్కో స్టేట్ మేనేజర్ రామకృష్ణయ్య, ఇఫ్కో కంపెనీ జిల్లా మేనేజర్ బాలాజీ, జిల్లా సహకార అధికారి రామాను జాచారి, కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావు మాట్లాడారు. రైతులు సంఘం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ, ఎంపీపీ చిలుకా రవీందర్, మాజీ సంఘ అధ్యక్షులు గుంటి మల్లయ్య, క్యాతం పురుషోత్తం, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, సంఘ ఉపాధ్యక్షుడు ముద్దం మహేశ్ గౌడ్, డైరెక్టర్లు గుర్రం ఆనంద రెడ్డి, నాంపల్లి మల్లయ్య, లంబు రాజిరెడ్డి, కళ్లెం లక్ష్మీరెడ్డి, దుర్గం పద్మ, గుర్రం సునంద, మంగళారపు మల్లారెడ్డి, కోస్న తిరుపతిరెడ్డి, సత్తు నర్సయ్య, బండారి కొమురయ్య, రేవెల్లి బాలయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు ముద్దం తిరుపతి, నాయకులు మునిగాల చందు, సంఘ సభ్యులు, రైతులు, పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 61 మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఎంపీపీ చిలుక రవీందర్, కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు ముద్దం తిరుపతి, నాయకులు మునిగాల చందు, పలువురు ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు పాల్గొన్నారు.

'ధరణి' దరఖాస్తులపై సత్వర చర్యలు చేపట్టాలి

కలెక్టరేట్, జూన్ 14 : జిల్లాల్లో ధరణి పెండింగ్ దరఖాస్తులపై సత్వరమే చర్యలు తీసుకోవాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులు, మ్యూటేషన్‌ల పరిష్కారానికి మరోసారి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. అధికంగా పెండింగ్ ఉన్న మండలాలకు అవసరమైన అదనపు సిబ్బందిని కేటాయించాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయిలో ప్రతి మంగ, శుక్రవారాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే భూ సంబంధిత సమస్యలను సైతం కలెక్టర్లకు బదిలీ చేస్తామని, వీటిని అత్యంత ప్రాధాన్యతతో సత్వర పరిష్కారం జరిగేలా చూడాలని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంపు ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్నదని, దీనికోసం జిల్లాలో భూముల మార్కెట్ విలువ, ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువ వివరాలతో కూడిన నివేదికను అందించాలని సూచించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్, గంగాధరలో అనువైన భవనం లేదా భూమి కేటాయించి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్‌వో పవన్ కుమార్, కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు మహేశ్వర్, రమేశ్ బాబు, అన్ని మండలాల తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

మధురానగర్ వాసికి బెస్ట్ మోటివేటర్ అవార్డు

గంగాధర, జూన్ 14: మధురానగర్‌లో ఆర్ఎంపీగా పని చేస్తున్న వడ్డకొండ రవీందర్ బెస్ట్ మోటివేటర్ అవార్డుకు ఎంపికయ్యారు. రక్తదానం చేయడంతో పాటు ఇతరులను రక్తదానం చేసేలా ప్రోత్సహిస్తూ, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకుకు సహకరించినందుకు అవార్డుకు ఎంపికైనట్లు రవీందర్ తెలిపారు. కాగా, ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్ రాజ్‌భవన్‌లో తెలంగాణ రెడ్‌క్రాస్ చైర్మన్ అజయ్‌మిశ్రా చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

ఐపీఈతో వివేకానంద కళాశాల ఎంవోయూ

ఎంవోయూ అందుకుంటున్న కళాశాల ప్రిన్సిపాల్

కమాన్‌చౌరస్తా, జూన్ 14: జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్(ఐపీఈ)తో ఎంవోయూ కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోనే ప్రతిష్టాత్మకమైన మేనేజ్‌మెంట్ విద్యాసంస్థ ఆయన ఐపీఈతో ఎంవోయూ కుదరడం గొప్ప అవకాశంగా భావిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా వివేకానంద కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులకు ఐపీఈ వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. అలాగే, వివేకానంద కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల బృందం ఐపీఈ సందర్శన, ఐపీఈలో జరిగే ట్రైనింగ్ కార్యక్రమాల్లో పాల్గొనవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ శ్రీనివాస్ మూర్తి, డీన్ అకాడమిక్ ప్రొఫెసర్ వీ శ్రీకాంత్, పీజీడీఎం ప్రోగ్రాం అధిపతి ప్రొఫెసర్ వై రామకృష్ణ, వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఆర్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాద రహితంగా కరీంనగర్ సర్కిల్

ముకరంపుర, జూన్ 14: ఎన్పీడీసీఎల్ పరిధిలో కరీంనగర్‌ను 'జీరో' విద్యుత్ ప్రమాద రహిత సర్కిల్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామని ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ భద్రతపై నిర్లక్ష్యం, అవగాహన లోపం, వినియోగదారుల గృహాల్లో నాణ్యమైన వైరింగ్ లేకపోవడం, నాసిరకం పరికరాలు, వ్యవసాయానికి సంబంధించి రైతులు స్విచ్ బోర్డులు, మోటర్ స్టార్టర్ల వద్ద ఎర్తింగ్ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నందున భద్రతా ప్రమాణాలు పాటించాలని కోరారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే ఉద్యోగులు భద్రతా విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.

ఆర్టీసీ ప్రగతి చక్ర అవార్డుల ప్రదానోత్సవం

వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన ఉద్యోగులతో ఈడీ వినోద్‌కుమార్, ఆర్ఎం సుచరిత

తెలంగాణచౌక్, జూన్ 14: జిల్లా కేంద్రంలో బస్టాండ్ ఆవరణలో గల సమావేశ మందిరంలో ఆర్ఎం సుచరిత ఆధ్వర్యంలో శుక్రవారం 2023-2024 సంవత్సరానికి గానూ వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పీ పురుషోత్తం మాట్లాడుతూ, ప్రతి డ్రైవర్ ఏకాగ్రతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ, జోనల్‌లోని 39 డిపోలు లాభాల బాటలో ప్రయాణించడం కోసం సిబ్బంది చేస్తున్న కృషిని అభినందించారు. ఆర్ఎం సుచరిత మాట్లాడుతూ, ఓపికతో విధులు నిర్వహిస్తూ ప్రయాణికుల మన్ననలు పొందాలని సూచించారు. అనంతరం వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన సిబ్బందిని శాలువాలతో సన్మానించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్లు భూపతిరెడ్డి, సత్యనారాయణ, డీఎంలు మల్లేశం, మల్లయ్య, పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఏటీఎం రజినీకృష్ణ, స్టేషన్ మేనేజర్ అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సెలవుల్లో కమిషనర్

కార్పొరేషన్, జూన్ 14 : కరీంనగర్ సంస్థ కమిషనర్ శ్రీనివాస్ సెలవులో వెళ్లారు. ఈ నెల 29 వరకు వ్యక్తిగత పనులతో సెలవు పెట్టారు. ఇన్‌చార్జి కమిషనర్‌గా డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణికి బాధ్యతలు అప్పగించారు.

ఆ భూమి ప్రభుత్వానిదే..

- 'నమస్తే' ఎఫెక్ట్
- ధర్మారం శిఖం సర్వేలో తేల్చిన అధికారులు
- కలెక్టర్‌కు నివేదిక..
- ఫేక్ పట్టాతో కబ్జాకు యత్నించిన వ్యక్తిపై కేసు నమోదుకు రంగం సిద్ధం



మండల అధికారులు కలెక్టర్‌కు అందించిన నివేదిక

జమ్మికుంట, జూన్ 14: మున్సిపల్ పరిధిలోని ధర్మారం వార్డులో రూ.కోట్లు విలువజేసే గొడుగు శిఖం ప్రభుత్వ భూమి ఆక్రమణకు కొందరు చేసిన ప్రయత్నాలకు అధికారులు అడ్డుకట్ట వేశారు. శిఖం భూమి కబ్జా చేస్తున్న వైనంపై స్థానిక వార్డు కౌన్సిలర్ బొంగోని వీరన్న కలెక్టర్‌కు ఫిర్యాదు.. సదరు శిఖంపై 'నమస్తే' కథనాలు అధికారులను కదిలించాయి. ఎట్టకేలకు కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖాధికారుల ఆధ్వర్యంలో సర్వే చేశారు. రికార్డులు పరిశీలించారు. ఆ భూమి శిఖందేనని తేల్చారు. ఇక, ఫేక్ పట్టాతో శిఖంను కబ్జాకు యత్నించిన వ్యక్తులపై నేడో, రేపో కేసు నమోదుకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది.

జరిగింది..

మున్సిపల్ పరిధిలోని ధర్మారం శివారులో సర్వే నంబర్ 368లో 33 గుంటల గొడుగు కుంట ఉంది. దాని చుట్టు పక్కల ప్రైవేట్ భూములున్నాయి. సదరు శిఖంపై కొందరు రియల్టర్ల కన్నుపడింది. గత నెలలో కొందరు వ్యక్తులు శిఖంను కబ్జా చేసేందుకు పూనుకున్నారు. టిప్పర్లతో కుంటను పూడ్చి వేస్తున్న సమయంలో స్థానిక కౌన్సిలర్ బొంగోని వీరన్న మండల అధికారులకు ఫిర్యాదు చేశారు. మండల అధికారులు శిఖం వద్దకు వెళ్లారు. కానీ, కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తులు పట్టా సర్టిఫికెట్లు చూపారు. సొంత భూమంటూ బుకాయించారు. అధికారులు తిరిగి వెళ్లడంతో.. శిఖం కబ్జా కొనసాగించారు. దీంతో గత నెల 28న కౌన్సిలర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు నేపథ్యం.. కబ్జా జరుగుతున్న వైనంపై 'నమస్తే తెలంగాణ' కథనాన్ని ప్రచురించింది. దీంతో మరుసటి రోజు కలెక్టర్ స్పందించారు. శిఖం కబ్జాపై నివేదిక ఇవ్వాలని రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖను ఆదేశించారు. మూడు శాఖల అధికారులు రంగంలో దిగారు. సర్వే చేశారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు.

ఆ భూమి శిఖమే..

గత నెల 30న ధర్మారం కౌన్సిలర్ వీరన్న, తదితరుల సమక్షంలో అధిక